క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర

దేవరకొండ : పట్టణంలోని ఆయా కాలనీల్లో పలు ఉత్సవ కమిటీ సభ్యులు దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు కోలాటాలు, నృత్యాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హిందువులు సంఘటితం కావాలి



కొండమల్లేపల్లిలో ఆర్ఎస్ఎస్ పద సంచన

కొండమల్లేపల్లి : హిందువులు సంఘటితం కావాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ కార ఎర్ర నర్సింగ్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొండమల్లేపల్లిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కవాతు చేపట్టారు. అనంతరం నిర్వహించిన పదసంచన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నారెడ్డి రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ రైల్వేస్టేషన్ పార్క్‌లో ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్యులు డయాబెటిక్ పరీక్షలు, స్క్రీనింగ్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, వైస్ ప్రెసిడెంట్ వన్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా క్లబ్ సభ్యుడు చొగోని యాదగిరి సౌజన్యంతో మెడిసిన్ చదువుతున్న ఒక పేద విద్యార్థినికి రూ.10 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఏదుల అంజిరెడ్డి, తంతెనపల్లి సైదులు, యాస వెంకట్‌రెడ్డి, బుర్రి కృష్ణ శేఖర్, మంచికంటి నాగేశ్వరరావు, బూర నరసయ్య, పజ్జూరి కరుణాకర్‌రెడ్డి, ములక నాగిరెడ్డి, చొగోని యాదగిరి, ముప్పిడి మల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో ఆదివారం తిప్పర్తి మండల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడంతో ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోటీ చేసిన అన్ని స్థానాలను గెలుచుకొని కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కటికం సత్తయ్య గౌడ్, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, లొడంగి గోవర్ధన్, ఊట్కూరు సందీప్‌రెడ్డి, తండు నరసింహ, కందుల లక్ష్మయ్య, వనపర్తి జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

భక్తితో భగవంతుడిని ప్రార్థించాలి

హుజూర్‌నగర్ : భగవంతుడిని సంతృప్తి పరిచే మార్గం భక్తి మాత్రమే అని ఇస్కాన్ టెంపుల్ (హైదరాబాద్) భగవద్గీత ప్రచారకులు ప్రభుజీ హిషీకేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో భగవద్గీత సత్సంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భవద్గీత తొమ్మిదో అధ్యాయంపై ప్రసంగించారు. భగవంతుడిని సంతృప్తి పరచడం కేవలం భక్తి వల్లనే సాధ్యం అవుతుందని చెప్పారు. భగవంతుడికి ప్రేమతో, భక్తితో ఓ పత్రం, ఓ పుష్పం, ఓ ఫలం సమర్పించినా సరే సంతృప్తి చెందుతారని తెలిపారు. భగవంతుడితో పాటు ప్రతి ఒక్కరిపై ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని, ఇతరులకు సాయం చేసే గుణం కలిగి ఉండాలన్నారు. తొలుత ప్రభుజీ హిషీకేశ దాస్, స్టేజీ, ప్రసాద వితరణ దాత గుండా జ్యోతి శ్రీనివాస్, కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, ఆత్కూర్ ఆంజనేయులు, బొగ్గవరపు రాధ, పెండ్యాల నాని, ఉప్పేపల్లి చంద్రం, సతీష్, శ్రీను, పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- గుంతల రోడ్డుతో వాహనదారులకు ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని రోడ్లు



కంకరతేలి అధ్వానంగా ఉన్న చక్కోలం - పిల్లిగుండ్లతండా రోడ్డు



గుంతలమయంగా మారిన నేతాపురం- డొక్కలబావితండా రోడ్డు



కంకరతేలి అధ్వానంగా మారిన కొంపల్లి- సుంకిశాలతండా రోడ్డు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రతినిత్యం ఆయా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు ఈ రహదారుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ×అడుకో గుంత తీరేనా మా ఈ చింత× అన్న చందంగా మారాయి. మండలంలోని డొక్కలబావితండా– నేతాపురం రోడ్డు మరమ్మతులకు గురైంది. మిర్యాలగూడ పట్టణంతో పాటు, నిడమనూరు మండలంలో ప్రసిద్ధి గాయించిన కోటమైసమ్మ, దామరచర్ల మండలంలో బంగారు మైసమ్మ దేవస్థానాలకు వెళ్లాలంటే ఈ దారిగుండా వెళ్లాల్సి ఉంటుంది. డొక్కలబావితండా, రాజవరం, బోయగూడెం, గర్కనట్‌తండా, జెవ్విచెట్టుతండా, తునికినూతల, కిచ్యతండా, నాయకునితండా, తిమ్మయ్యపాలెంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు మిర్యాలగూడ వెళ్లాలంటే ఈ రహదారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఈ రహదారి పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో తిరుమలగిరి మండల కేంద్రం మీదుగా హాలియా నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డు దెబ్బతినడంతో ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం మిర్చి కోతులు ముమ్మరంగా సాగుతుండటంతో ఆయకట్టు గ్రామాల ప్రజలు ఈ దారి గుండానే ఆటోల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఏర్పడుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. రాత్రివేళ ఈ దారిగుండా ప్రయాణించే వాహపన దారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా లేకపోలేదు.

ప్రయాణం నరకయాతన

మండలంలోని యల్లాపురంతండా నుంచి పిల్లిగుండ్ల తండాకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని కంకరతేలి ఉంది. చింతలపాలెం, గోడుమడక, నెల్లికల్లు, ఎర్రచెరువుతండా, జాల్‌తండా, బట్టువెంకన్నబావి తండా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఈ దారి గుండానే రావాలి. దీంతో పాటు నాగార్జునసాగర్‌కు వెళ్లే వారు కూడా ఈ దారిగుండానే వెళ్తారు. అలాగే కొంపల్లి నుంచి సుంకిశాలతండాకు వెళ్లే రహదారి కూడా పూర్తిగా కంకరతేలి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారులు పూర్తిగా కంకరతేలి ప్రమాదకరంగా మారి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



డొక్కలబావితండా, నేతాపురం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అడుగుకో గుంత ఏర్పడటంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నాం. మిర్యాలగూడ వంటి పట్టణాలకు వెళ్లాలంటే ఈ దారి మాకు చాలా దగ్గరగా ఉంటుంది. వర్షాలు వచ్చినప్పుడు గుంతల్లో నీరు చేరి గుంతలు కనపడకుండా ఉంటున్నాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రమావత్ కృష్ణ నాయక్, డొక్కలబావితండా

ప్రమాదాలకు గురవుతున్నాం



యల్లాపురంతండా, పిల్లిగుండ్లతండా రోడ్డు గుంతలమయంగా మారి కంకరతేలి ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్న పట్టించుకున్న నాథుడే లేడు. నాగార్జునసాగర్‌కు వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా ఈ దారి నుంచే రావాలి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి. ప్రమాదాలను నివారించాలి.

– జటావత్ జగదీశ్ నాయక్, పిల్లిగుండ్లతండా

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మాడుగులపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుగుల గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యర్తల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల్లోనే ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని మూటగట్టుకుందని, గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. మండలానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డిలు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బీఆర్ఎస్ తరఫున ఎవరిని అభ్యర్థిగా నియమించినా అందరు సమష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోసిన్‌అలీ, నాయకులు నిమ్మల నవీన్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెన్న శ్రవణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోకల రాజు, ఇంద్రారెడ్డి, పగిళ్ల సైదులు, జెర్రిపోతుల రాములుగౌడ్, చింతరెడ్డి యాదగిరిరెడ్డి, సింగం శివ, గడ్డమీది సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

పెద్దవూర : ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసే సీపీఎం అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం పెద్దవూర మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తమకు బలమున్న అన్ని స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తుందని తెలిపారు. పాలక రాజకీయ పార్టీలు డబ్బు సంచులు, మందుబాటిళ్లు, కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకొని ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన వాగ్దానాలను మరిచిందని ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, దోరెపల్లి మల్లయ్య, ఎస్‌కె బషీర్ దుబ్బ ఏడు కొండలు, దేశ్యానాయక్, మగ్దూం మోహినొద్దీన్, కృష్ణ, పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషిచేసిన నేత వెంకటస్వామి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నిరుపేద కార్మికుల సంక్షేమం కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకుడు గడ్డం వెంకటస్వామి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం వెంకటస్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెంకటస్వామి అనేక కార్మిక ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటాలు చేశారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి అని కొనియాడారు. హైదరాబాద్‌లో ఎంతో మంది కార్మికులకు, నిరుపేదలకు బస్తీలు కట్టించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డ్ ఈవెంట్‌లో చిన్నారులు



చిన్నారుల చేతిలో వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్స్

పెద్దవూర : చెన్నైలోని తాభరం ప్రాంతంలోని ఎస్ఐవీఈటీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెండ్ లార్జెస్ట్ కరాటే ఈవెంట్‌లో మండలంలోని చలకుర్తికి చెందిన పాతనబోయిన సుదీక్ష, విహాస్‌లు పాల్గొన్నారు. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడంలో ఆ చిన్నారులు భాగస్వాములు అయ్యారు. తెంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులు మాట్లాడుతూ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో తమపై బాధ్యత కూడా పెంచిందని, ముమ్ముందు కఠోర శ్రమతో సాధన చేసి మరెన్నో అంతర్జాయతీ పతకాలు సాధించి పుట్టిన ఊరికి పేరు తెచ్చి పెడుతామన్నారు. చిన్ననాటినుండే తమ వెంట ఉండి శిక్షణ ఇప్పిస్తున్న తమ తల్లిదండ్రులకు, కోచ్ మహేష్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఉన్నత విద్యకు పేదరికం అడ్డురాకూడదు

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : విద్యార్థుల ఉన్నత చదువుకు పేదరికం అడ్డురాకూడదని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్ నాయక్ అన్నారు. వీర్లపాలెం గ్రామానికి చెందిన పానుగోతు ధనలక్ష్మీ పాండిచ్చేరి ఎస్ఐటీ కళాశాలలో చదవడానికి గానూ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొత్త రాఘవేంద్రప్రసాద్ రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. ముమ్ముందు కూడా రాఘవేంద్రప్రసాద్ ఇలాంటి సేవలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, కొండా లక్ష్మణ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ వ్యతిరేక శక్తులను తరిమికొడతాం

మిర్యాలగూడ టౌన్ : జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని కొంతమంది కోర్టుల ద్వారా అడ్డుకోవాలని చూసే వారిని ఈ ఎన్నికల్లో తరిమికొడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60శాతం వరకు బీసీలు ఉన్నారని, దాని ప్రకారమే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని.. కానీ కొంతమంది కోర్టుల ద్వారా అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారికి తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలంతా ఏకం కావాలన్నారు.

మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సన్మానం



కార్యక్రమంలో పాల్గొన్న నూతన కార్యవర్గ సభ్యులు

వేములపల్లి : మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మండలంలోని శెట్టిపాలెంలో దాక్షాయని ఫుడ్ ప్రొడక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గ నాయకులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నూతన అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శులు భోగవెల్లి వెంకటరమణచౌదరి, ఉపాధ్యక్షుడు గోళ్ల రామశేఖర్, కోశాధికారి గందె రాము, కార్యదర్శి పోలిశెట్టి ధనుంజయ, దాక్షాయని ఫుడ్ ప్రొడక్ట్ యాజమాన్యం జేవీ రమణ, చలమారెడ్డి, తిరుపతిరావు, గోపి, సురేందర్, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చార్జీలు పెంచి దోచుకోవడం సరైంది కాదు



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

వేములపల్లి : పండుగ సమయాల్లో ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రయాణికులను దోచుకోవడం సరైందికాదని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. పండుగల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రయాణికులను నిలువునా దోపిడీ చేస్తోందని అన్నారు. వ్యాపార దృక్పథంతో సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు. ఆర్టీసీ లోటును పూడ్చుకోవడం కోసం చార్జీలను పెంచడం సరికాదని తెలిపారు. పండుగ వేళల్లో సైతం సాధారణ చార్జీలను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, వడ్డెగాని సైదులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గల చిత్ర ఎలక్ట్రానిక్స్ పక్కన దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన దుకాణదారులు కోరారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 70 ఏళ్లుగా ప్రజలు నడుస్తున్న దారిని జయప్రకాష్ అనే వ్యక్తి ఆక్రమించి ప్రశ్నించిన తమను తిట్టడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు విచారణ చేసి దారిని కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ఇడుకుల్ల ప్రభాకర్, మంజుల, గట్టు శ్రీధర్, శ్యామ్, వాసు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని ఆల్ఫా పబ్లిక్ స్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ఫా స్కూల్ కరస్పాండెంట్ బాదిని నరసింహ, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, లింగయ్య, రమావాణి, నసీం, శంకరయ్య, రవీందర్, అహ్మద్ అలీఖాన్, సురేష్‌రెడ్డి, ప్రసాద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సందీప్, ప్రియాంక, ఉష, మహేష్ పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు



నగారాదుబ్బతండా నుంచి తవక్లాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో..

చెట్ల కొమ్మలను తొలగించరూ!

డిండి : మండల పరిధిలోని సింగరాజుపల్లి నుంచి రహమంతాపూర్, నగారాదుబ్బతండా నుంచి తవక్లాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నాయి. అదేవిధంగా రాత్రి వేళల్లో ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు తొలగించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలని కోరుతున్నారు.

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గంలోని పేద ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థులకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందచేశారు. ఆదివారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మిర్యాలగూడ యూనిట్ అధ్యక్షుడు ఏచూరి మురహరి, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి కాదర్‌బాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 125 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు సుమారు రూ.5లక్షల నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత మాట్లాడారు. అసోసియేషన్ అందించే సహాయంతో విద్యార్థులు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని, అలాగే మరికొంతమంది పేద విద్యార్థులకు తమవంతుగా చేయూత అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు శిల్ప, ఉపాధ్యక్షులు ఇరుకుల్ల చెన్నకేశవరావు, ప్రధాన కార్యదర్శి పోలా శ్రీధర్, సభ్యులు కొందికొండ శ్రీనివాస్, ఏచూరి శ్రీనివాస్, గుండాల లక్ష్మీకాంతం, శ్రీనివాస్, తెడ్ల రఘు, గుంటూరు జనార్దన్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కర్నాటి శ్రీనివాస్, ఆనంద్, పందిరి రవీందర్, సింగిరికొండ రమేష్, పారేపల్లి శంకర్, అశోక్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

ఆర్థికసాయం అందజేత

డిండి : మండల కేంద్రానికి చెందిన ఈరటి అంజనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం డిండి పట్టణ ట్రాక్టర్ అసోషియేషన్ సభ్యులు ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఆంజనేయులు, సైదులు, వెంకటేష్, వెంకటయ్య, మోహినయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ రద్దీ

చిట్యాల: దసరా పండుగ సెలవులు పూర్తికావడంతో ఆదివారం విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో సర్వీస్ రోడ్డు మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. అయితే సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండి రహదారిపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతుండడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సైతం వాహనాలు నెమ్మదిగా వెళుతుండడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా బారీకేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.



హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు